# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 06 డిసెంబరు, 2025 | పేజీలు :08


## వలస కూలీల పిల్లలను బడిలో చేర్పించాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లావ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణంగా వలస కూలీలు పనిచేసే చోటే వర్క్ సైట్ స్కూళ్లు ప్రారంభిస్తారని, కానీ పిల్లలకు పాఠశాల వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, వారికి పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని పేర్కొన్నారు. యజమానులు పిల్లల రవాణాకు సహకరించాలని కోరారు. గత ఏడాది సుమారు 500 మంది పిల్లలను చేర్పించామని, ఈ ఏడాది మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఫలితాలు సాధించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి గ్యాస్ కనెక్షన్లు వినియోగించాలని, స్నేహిత ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# శబరిమల వెళ్లే స్వాములకు రెండు ప్రత్యేక రైళ్లు

### పలించిన మంత్రి అడ్లూరి కృషి
### ఆనందం వ్యక్తం చేసిన అయ్యప్ప స్వాములు, భక్తులు

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** నాందేడ్ నుండి వయా జగిత్యాల మీదుగా అయ్యప్ప స్వాముల కొరకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలనీ కాంగ్రెస్ సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముకేశ్ ఖన్నా గత కొన్ని రోజుల నుండి రైల్వే అధికారులకు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ న్ కుమార్ కు విన్నవించడం జరిగింది. మంత్రి అడ్లూరి లక్ష్మ న్ కుమార్ వెంటనే స్పందించి దక్షిణ మధ్య రైల్వే జీఎం గారితో మాట్లాడి ప్రత్యేక రైలు గూర్చి మాట్లాడటం జరిగిందని స్పందించిన రైల్వే అధికారులు విషయం రైల్వే శాఖ ఉన్నతాధికారులకు తెలపటంతో ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. డిసెంబర్ 24, జనవరి 07తేదిలలో నాందేడ్ నుండి కొల్లం వరకు (శబరి మల )వెళ్లే స్వాముల కొరకు రెండు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి జగిత్యాల అయ్యప్ప స్వాములకు అందుబాటులో ఉండనుందని కాంగ్రెస్ సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముకేశ్ ఖన్నా తెలిపారు. రెండు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినందుకు అయ్యప్ప స్వాములు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



### పోలింగ్ కేంద్రాలను
## పరిశీలించాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్:** రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఇసి) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ముస్తాబాద్ లోని రైతు వేదికలో శుక్రవారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హాజరై ఎన్నికల నిర్వహణ, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు. ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడూతూ, ఎస్ ఈ సీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ముస్తాబాద్ లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. హెల్ప్ డెస్క్, నామినేషన్లు పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. శిక్షణలో మండల ప్రత్యేక అధికారులు అఫ్జల్ బేగం, రాఘవేందర్, క్రాంతి, తహసీల్దార్లు సుజాత, రామచందర్, ఎంపీడీఓలు సత్తయ్య, లచ్చాలు, ట్రైనర్లు పాల్గొన్నారు.

### విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు
## ప్రతి నెల పాఠశాలలను పరిశీలించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు ప్రతి నెల పాఠశాలలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పాఠశాల పర్యవేక్షణలో అభ్యాసన అభివృద్ధి అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో అభ్యాసనాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మండల విద్యాధికారులు (ఎమ్ఇఒ) లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు ప్రతి నెలా పాఠశాలలను పరిశీలించి, సమీక్ష చేయాలని ఆదేశించారు.పెద్దపల్లి జిల్లాలోని 14 మంది మండల విద్యాధికారులు, 36 మంది కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, తమ పరిధిలోని పాఠశాలలలో ప్రతి నెలా మానిటరింగ్ నిర్వహించి, బోధనా ప్రక్రియలో ఉన్న లోటుపాట్లను గుర్తించి, సమీక్షా నివేదికను సిద్ధం చేసి, జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని,ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి సిలబస్‌ను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని, అలాగే స్టడీ అవర్స్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కోరారు. అకాడమిక్ ప్యానల్ బృందాలు ఇటీవల పాఠశాలలలో నిర్వహించిన పరిశీలనలో ఉపాధ్యాయుల బోధనా తీరు,పాఠశాల నిర్వహిస్తున్న విద్యా అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యం,తరగతి గదిలో గమనించిన లోపాలుఉపాధ్యాయులకు ఇచ్చిన మెరుగుదల సూచనలు అంశాలపై సమగ్ర నివేదికను పరిశీలించామని ,తదుపరి, ఆ సూచనలు పాఠశాలలో అమలు అయ్యి అభ్యాసన ఫలితాల్లో ఎంత మేర మెరుగుదల వచ్చింది అనే అంశాలను ఒక నెల తరువాత తిరిగి పరిశీలించాలని, అదేవిధంగా, ప్రతి పాఠశాలను నిరంతరం మానిటర్ చేస్తూ, అవసరమైన సందర్భంలో ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, హెడ్మాస్టర్లతో కూడా ప్రత్యేకంగా నెలవారీ సమీక్షలు నిర్వహించి, పాఠశాల ప్రగతిపై పూర్తి వివరాలను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిఎం. షేక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విజయవంతంగా మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా జరిగిందని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నందు శుక్రవారం పెద్దపల్లి రీజనల్ టాస్క్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా భారీ స్పందన వచ్చిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని, అందులో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా జరిగిందని తెలిపారు. మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 16 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై ప్రత్యేకత ఏర్పాటు చేసారని, ముందస్తుగానే ప్రభుత్వ ప్రైవేటు ఇంజనీరింగ్ డిగ్రీ వివిధ వృత్తి నైపుణ్యం కళాశాలలకు జాబ్ మేళా నిర్వహణపై సమాచారం అందించడంతో మొత్తం 931 మంది నిరుద్యోగ యువతీ, యువకులు, గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మెగా జాబ్ మేళా కు హాజరై అయ్యారని తెలిపారు.పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్ లో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సులలో శిక్షణ ఉచితంగా అందించి ఉద్యోగ అవకాశాలు కూడా ఇప్పించడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు రీజనల్ టాస్క్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, రీజినల్ టాస్క్ సెంటర్ ఇంచార్జి కౌసల్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో మండల ప్రాథమిక పాఠశాలలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బండారి మధు హాజరై మాట్లాడారు. దివ్యాంగులైన పిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రులు ఎన్నో సాధక బాధలు పడుతున్నారు. సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వాళ్లను అన్ని రంగాల్లో రాణించేందుకు సమగ్ర శిక్ష ద్వారా ఎస్కార్ట్ అలవెన్స్, ఫిజియోథెరపీ, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ కల్పిస్తున్నది. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో దివ్యాంగ విద్యార్థుల కొరకు ప్రత్యేక టీచర్లను కూడా ప్రభుత్వం నియమించడం జరిగిందని, మండల విద్యాధికారి తెలిపారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రదీప్, ఉపాధ్యాయులు స్వాతి, రమేష్, సి ఆర్ పి రవీందర్, రాజేందర్ , శివరాం , ఐఆర్పి శ్రీకాంత్, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకురాలుకు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి జగిత్యాలలో పనిచేస్తున్న వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ క్రిస్టఫర్ రూబెన్ పర్యవేక్షణలో టిష్యూ కల్చర్ ఫైటో కెమికల్ అనాలసిస్ మరియు ఫార్మకాలజికల్ స్టడీస్ ఇన్ రూబియా కార్డుఫోలియా అని శీర్షికపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ప్రమోద్ కుమార్, చంద్రయ్య, డాక్టర్ సంగీత, డాక్టర్ వాసవి మరియు డాక్టర్ జమున అభినందించారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పిట్టల వెంకటేష్ అయ్యప్ప స్వామి ఇంటిలో శుక్రవారం వినోద్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుంకుమార్చన, అభిషేకం, అష్టోత్తరం, 18 మెట్ల పడిపూజ కార్యక్రమం జరిగింది. ఈ పడిపూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్ప నామస్మరణతో మారుమొగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టును పట్టణ పరిధిలో నిర్మించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణ పరిధిలోనే జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఠాకూర్ అజయ్ క్రాంతి సింగ్ నేతృత్వంలోని న్యాయవాదులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ అధ్యక్షుడు లకిడి భాస్కర్ పై అవిశ్వాస తీర్మాణం పెట్టలేదని, ఆయనను తొలగించలేదని, తాత్కాలికంగా మాత్రమే అధ్యక్షుడిపై ఏడాదికాలం పాటు సస్పెన్షన్ వేటు వేశామని వివరణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా సభ్యులకు సరైన సమాచారంలేకుండా వ్యక్తిగత ప్రయోజనాలకోసం పనిచేయడం వల్లే మెజారిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి లకిడి భాస్కర్ ను అధ్యక్ష్య పదవి నుండి తప్పించడం జరిగిందని తెలిపారు. రాఘవాపూర్ వద్ద కోర్టు నిర్మాణం చేపట్టే తీర్మాణంపై బార్ అసోసియేషన్ సభ్యులెవరు సంతకాలు చేయలేదని, మొదటి నుండి ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అసోసియేషన్ తో సంబంధంలేని వ్యక్తులతో సంతకాలు చేయించి తీర్మాణాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర అధికారులకు మాజీ అధ్యక్షుడు లకిడి భాస్కర్ సమర్పించారని పేర్కొన్నారు. అసత్య ప్రచారలు చేస్తే శాశ్వత బహిష్కారానికి గురికావల్సి వస్తుందని శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఎక్కడైనా కోర్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అలా కాదని రాఘవాపూర్ లో కోర్టు ప్రతిపాదనలను అమలుచేస్తే ఎదురిస్తామని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సభ్యులు రెడ్డి శంకర్, బొంకూరి శంకర్, ఠాకూర్ క్రిష్ణ క్రాంతిసింగ్, మామిడిపల్లి శరత్ కుమార్, లవన్ కుమార్, రెడ్డి నర్సింగ్, తాని నరేష్, ఆసరి రమేష్ యాదవ్, ఉద్దెండ నవీన్, పాతర్ల శివ, బోండ్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్‌గా అంబటి జోజి రెడ్డి ఎన్నిక




**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా కరీంనగర్ జిల్లాకు చెందిన అంబటి జోజి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ఈ విషయాన్ని వెల్లడించారు. పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, రాబోయే రాజకీయ పరిస్థితులపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. సభ్యత్వ పునరుద్ధరణ, లెవీ వసూలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతం, చరిత్ర, నాయకత్వ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు 2026 జనవరి 31లోపు రాష్ట్రస్థాయి పార్టీ పాఠశాల నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ రాష్ట్ర కన్వీనర్ గా జోజి రెడ్డి పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. అనంతరం జోజి రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** దివ్యాంగ పిల్లలలో మనోధైర్యాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని, ఆ దిశగా సింగరేణి తరఫున సహకారం అందిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీరాంపూర్ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సిఇఆర్ క్లబ్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగ విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సమాజంలో పిల్లలు తమ సామర్థ్యాలను నిరూపించుకునేలా మార్గనిర్దేశం చేసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేక ప్రతిభ కలిగి ఉంటారని, వారిని ఉన్నత శిఖరాలు చేరేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారి ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో రన్నింగ్ రేస్, త్రో బాల్ వంటి విభాగాలలో పోటీలను నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, స్పోర్ట్స్ చీఫ్ కోఆర్డినేటర్ డివై జిఎం ఎస్ అనిల్ కుమార్, స్పోర్ట్స్ హనరారీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.

## లారీలు అందుబాటులో ఉండాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బోయినపల్లి, కోనరావుపేట మండలాలకు చెందిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీల కాంట్రాక్టర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు, నిలువుల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంట వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత, డీసీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నోబెల్ హై స్కూల్ విద్యార్థికి జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రామగుండం ఎన్‌టిపిసి లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో నోబెల్ హై స్కూల్ పెద్దకల్వల విద్యార్థినికి జిల్లా ప్రథమ బహుమతినీ ఇన్చార్జి డి ఈ ఓ శారద చేతులమీద బహుమతి అందజేశారు.నోబెల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న సిరి మౌని, 8వ తరగతి చదువుతున్న పల్లవి ప్రియదర్శిని లు వేస్ట్ మేనేజ్మెంట్ అనే అంశంపై ఉపాధ్యాయులు యమున మరియు షబానా సహాయంతో ప్రాజెక్టు నిర్వహించారు. దీనిలో వాడి పడేసిన ప్లాస్టిక్ పదార్థాలను సేకరించి ప్రాసెస్ చేసి డాంబర్ తో కలిపి రహదారులను నిర్మించవచ్చని,దీనివలన వాతావరణ కాలుష్యం తగ్గించవచ్చునని నిరూపించినారు. ప్రధానోపాధ్యాయురాలు మరియు కరస్పాండెంట్ ప్రనితా మోహన్ రాజాలు వీరిని అభినందించారు.

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు బాల వైజ్ఞానిక్ ఇన్‌స్పైర్ అవార్డ్స్

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఎన్టిపిసి జ్యోతి నగర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన్ 2025 మరియు ఇన్స్పైర్ అవార్డ్స్ లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు వాటర్ కన్సర్వేషన్ మరియు మేనేజ్మెంట్ విభాగంలో జూనియర్ స్థాయిలో ఎన్. సాధ్వి జెసి ఆరవ తరగతి ప్రథమ స్థానం, సీనియర్ స్థాయిలో కే శృతి ప్రియ 9వ తరగతి ద్వితీయ స్థానం సాధించి కామారెడ్డి లో జరిగే రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ ఎంపిక పట్ల గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యతోపాటు వైజ్ఞానిక రంగంలో కూడా ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రపంచాన్ని, టెక్నాలజీని ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తయారు చేసే విద్యను అందిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులను అభినందించి ప్రశంస పత్రాలు, అవార్డ్స్ ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లంకి రజనీ దేవి , ప్రిన్సిపాల్ విజయ్ , గైడ్ టీచర్ సదానందం మరియు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## ఎన్నం మౌనిక మధుకర్ రెడ్డికి భారీ మద్దతు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కోసునూరుపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నం మౌనిక మధుకర్ రెడ్డి. శుక్రవారం నామినేషన్ వేశారు.మౌనిక అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ గ్రామ ప్రజలు భారీ ఎత్తున నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మౌనిక మధుకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందనీ వాటిని పరిష్కరించేందుకు సర్పంచుగా ఒక్కసారి అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని,జవాబుదారుగా ఉంటానని హామీ ఇచ్చారు.

# ఎన్నికల విధులను అప్రమత్తతతో నిర్వహించాలి

ప్రజాపక్షం/ముత్తారం : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు కలిగిన అధికారులు,సిబ్బంది వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.ముత్తారం మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొదటి విడతలో ముత్తారం మండలానికి ఈ నెల 11న పోలింగ్ ప్రక్రియ జరుగనుండగా, నామినేషన్ల స్వీకరణ నుండి మొదలుకుని ఇప్పటివరకు పూర్తి చేసిన ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ విధుల పర్యవేక్షణ అధికారి సురేందర్,ఎంపీడీవో సురేష్,తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి తోపాటు ఇతర అధికారులకు వివరించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా,ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటింగ్ కు అవసరమైన ఎన్నికల సామాగ్రి సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారితో పాటు, భద్రతా బలగాలలో కొనసాగుతున్న సర్వీస్ ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేలా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులతో మండల ప్రజా పరిషత్ అధికారులు, గ్రామ పంచాయితీ అధికారులు తోపాటు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పేరిట బిసిలను మోసం చేసిన సిఎం

ప్రజాపక్షం/ముస్తాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యే. సీఎం రేవంత్ తో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలి. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్ కు సమాధి కట్టింది. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం పొకాల శ్రీకాంత్ మడిగే ప్రవీణ్ పాల్గొన్నారు.

## చర్లపల్లి గ్రామం ఏకగ్రీవమై ఆదర్శంగా నిలిచింది

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో శుక్రవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చర్లపల్లి గ్రామ సర్పంచ్ మేడిపల్లి వనిత ఆనంద్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమల సుమన్, వార్డు మెంబర్స్ ఇమ్మడి విజయ్, బాలుసాని విజయ, బాలుసాని స్వరూప, కోల రాజిరెడ్డి, బొమ్మేన రాజేందర్ అందరిని శాలువతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందన్న సన్మానించారు.

మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామంలో ఏకగ్రీవంగా నిలిచి ఆదర్శంగా నిలిచిందని మాజీ మంత్రి అన్నారు. సర్పంచ్ వనిత ఆనంద్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు అందరూ కూడా ఐక్యమత్యంతోని కుల మతాలకు అతీతంగా గ్రామాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకొని గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని యొక్క భావనతోని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి అన్నారు. చర్లపల్లి గ్రామం నాకు ముందు నుండి అత్యంత సన్నిహితమైన గ్రామం. గతంలోనే జగిత్యాల నుండి కండ్లపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం చేసుకోవడం, అక్కడ కావాల్సిన సామూహిక భవనాలు త్రాగునీరు సదుపాయం కానీ అన్ని కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని మాజీ మంత్రి తెలిపారు. చర్లపల్లి గ్రామం ఏకగ్రీవంగా ఎంపిక చేసుకునే విధంగా అందరూ కూడా కలిసికట్టుగా రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నది కాబట్టి గ్రామ అభివృద్ధికి కావల్సిన అటువంటి మౌలిక సదుపాయాల కల్పనలో చర్లపల్లి గ్రామానికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తాను అని మాజీ మంత్రి హామీ ఇచ్చారు.

## పంచాయతీ ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/ముత్తారం : పంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మొదటి విడత పోలింగ్ జరిగే కమాన్ పూర్,రామగిరి మంథని ,ముత్తారం, శ్రీరాంపూర్ మండలాల లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సంబంధించి డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడివో కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పంపిణీ నిబంధన ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల, రిసెప్షన్ సెంటర్లో వద్ద ఏర్పాట్లు పై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మంథని పట్టణం లోని శ్రీపాద మార్గ్ 4 లైన్ విస్తరణ పనుల కోసం అలైన్మెంట్ ను కలెక్టర్ పరిశీలించి ట్రెంచ్ కట్టింగ్ పనులు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జడ్పీ సీఈఓ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో డబ్బులు దొంగలించిన వ్యక్తి అరెస్ట్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : బస్సులో ప్రయాణికుని వద్ద నుండి డబ్బుల బ్యాగును దొంగలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపి నిందితుని వద్ద నుండి 3,97,500 ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి వివరాలు వెల్లడించారు. బాధితుడు వేములవాడకు చెందిన నార్ల శ్రీనివాస్ డిసెంబర్ 3వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బండారి బాలరాజు 50 సంవత్సరాలు రుద్రవరం ను సీసీ కెమెరాల ఆధారంగా నిందితున్నీ గుర్తించి తన ఇంటి వద్ద శుక్రవారం పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు . డిసెంబర్ 3వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు బాధితుడు హైదరాబాద్ వెళ్లేందుకు వేములవాడలో బస్సు లో ఎక్కాడని బస్సులో తను కూర్చున్న సీట్లో నుండి బ్యాగును నిందితుడు బండారి బాలరాజు దొంగిలించుకుని చంద్రంపేటలో దిగి పారిపోయాడని తెలిపారు. బస్సులలో ప్రయాణించేటప్పుడు చుట్టూ ప్రక్కల ఉన్న వారిని గమనించి విలువైన వస్తువులు, నగలు, డబ్బులు ఉన్న బ్యాగులను వారి యొక్క చేతిలోనే పట్టుకొని జాగ్రత్తగా ఉండాలని, ఇతరులు ఏమైనా తినుబండారాలు గాని వాటర్ గాని ఇస్తే తీసుకోకుడదని డీఎస్పీ హెచ్చరించారు.

## నవజాత శిశువుల మరణాల్ని తగ్గించాలి



ప్రజాపక్షం/గోదావరిఖని: గోదావరిఖని లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.వాణిశ్రీ శుక్రవారం సందర్శించారు. రిజిస్ట్రేషన్ రిన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న పలు ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. స్కానింగ్ డేటా, ఫారంఎఫ్, సంబంధిత రికార్డులను పరిశీలించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. పుట్టబోయే పిల్లలు ఆడ అయిన, మగ అయిన సమానమే అన్న భావన ప్రజల్లో పెంపొందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్.ఎన్.సి.యు.లో నవజాత శిశువుల చికిత్స విధానాన్ని పరిశీలించారు. పిల్లల వైద్య నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజీవ్, నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి సువర్ణ, ల్యాబ్ ఇన్‌ఛార్జి శివ, వార్డు సిబ్బందితో సంకల్ప్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నవజాత శిశువుల మరణాల్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. అడ్డకుంటపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతి మంగళవారం మహిళా ఆరోగ్య కేంద్రం నిర్వహణకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమాధికారి డాక్టర్ బి.శ్రీరాములు, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ భవానీ, డిప్యూటి మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించిన గ్రామస్తులు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారంమండల కేంద్రం లోని కాసర్ల గడ్డ పరిధిలోని గుండ్లకుంట సమీపంలో గ్రామస్తులు శుక్రవారం రామాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ రామాలయ నిర్మాణానికి మారం నారాయణరెడ్డి రాధమ్మ,పెయ్యల కుమార్ పుష్పలత ఆధ్వర్యంలో గుడి నిర్మాణం కోసం అర గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు.ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ పెద్దమనుషుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కాసర్ల గడ్డ గ్రామస్తులు కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న రామాలయ నిర్మాణానికి ఇన్నాళ్లకు తొలి అడుగు పడదంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుచ్చంరావు,హనుమాన్ భక్తులు,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బిజెపిని వీడి కాంగ్రెస్‌లో చేరిన యువ నాయకుడు

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన దాసరి సృజన్ గౌడ్ అనే యువ నాయకుడు బీజేపీ పార్టీని వీడి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సింగిల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శీలం తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోటగిరి శ్రీనివాస్, రత్న రవీందర్, శ్రీనివాస్, దాసరి పురుషోత్తం గౌడ్, బంధారపు నారాయణ గౌడ్, నాగరాజు, వెంకటనారాయణ రెడ్డి, సముద్రాల సాయికుమార్, అల్లాడి రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్‌కు పూలమాల వేసిన సర్పంచ్ అభ్యర్థి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లి సర్పంచ్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొండ రమేష్ గౌడ్ భారీ ర్యాలీగా పార్టీ కార్యకర్తలతో వెళ్లి ఎలక్షన్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసి ఇచ్చారు. మొదటగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం భారీ ర్యాలీగా వెళ్లారు. వారి వెంట పాశం దేవిరెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు శ్రీనిత్య ఎంపిక

ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా ఎన్‌టిపిసి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మనక్ అవార్డు పోటీల కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్ గ్రామంలోని యూనివర్సల్ ఐఐటీ ఫౌండేషన్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సిహెచ్.శ్రీనిత్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికైంది. జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద, డిఎస్‌వో వి.హనుమంతుల నుంచి శ్రీనిత్య జ్ఞాపిక, ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీనిత్యను పాఠశాల కరస్పాండెంట్ ఎండి.ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో సైన్స్ విద్యను ప్రోత్సహించడం, వారిలో ఉన్న ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాల్లో పాల్గొనేలా వారికి అన్నివిధాల ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు.

## బాధిత మహిళ చికిత్సకు సాయం

ప్రజాపక్షం/గోదావరిఖని: రామగుండం పట్టణంలోని జీరోపాయింట్ ఏరియాకు చెందిన పేద మహిళ లక్ష్మి రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయింది. వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఈ విషయం తెలియడంతో స్థానిక సుభోద్ స్కూల్ నిర్వాహకులు రామ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం భరోసా స్వచ్ఛంద సంస్థ ద్వారా నెలకు సరిపడా మందులు, ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లికొండ రాజేష్ పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలి



**ప్రజాపక్షం/ముత్తారం:** ఈ నెల 11న జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ముత్తారం ఎస్సైరవికుమార్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం,పోతారం గ్రామాల్లో స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలలో ఎవరైనా ఎన్నిక ప్రక్రియ కోడ్ ను ఉల్లంఘించిన, అధికారుల విధులకు ఆటంకాలు కలిగించిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.గ్రామాల్లో ఎలాంటి విభేదాలు, వర్గపోరు సృష్టించకుండా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛ గావినియోగించుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో గొడవలకు కారణమైన వారిని ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరిగి ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అభ్యర్థులు మద్యం, డబ్బులు,ప్రోత్సకాలతో ఓటర్లను మభ్యపెడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యత తో ఉంచుతామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా చూడాలని. ఎన్నికల సమయంలో కేసులు నమోదు కావడం మూలంగా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కునువినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ప్రజలు ఇరు పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉందని ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. యువత అనవసర గొడవలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోకూడదని, ఒక కేసు నమోదైనా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు రావని సూచించారు. ఓటు వేసేటప్పుడు ప్రతి ఓటరు క్యూలైన్‌ను కచ్చితంగా పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హరిపురం, పోతారం గ్రామాలకు చెందిన సర్పంచ్ అభ్యర్థులతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజల తోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పోలింగ్ సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:**పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మండలంలో శిక్షణ పూర్తి అయ్యాక డిసెంబర్ 6 న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ స్వస్థల మండలం (ఓటు హక్కు నమోదైన) ఎంపీడీవో కార్యాలయం కు హాజరై పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో తమ వెంట ఫారం 14, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ప్రతులు సిబ్బంది తీసుకొని రావాలని, మొదటి విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఉన్నతాధికారులు అందించిన సూచనలు పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కళాశాలలో ముగిసిన హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్ కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ముత్తారం:** హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్ ప్రోగ్రామ్ ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 21 తేదీ నుండి ప్రారంభమైన మెడిటేషన్, యోగ,ఇన్స్పేషన్ తోపాటు మోటివేషన్ క్లాసులు నిరాటంకంగా శుక్రవారం వరకు కొనసాగాయి. ఒత్తిడిని విద్యార్థులు ఎలా ఎదుర్కోవాలి, ఎలా చదవాలి సమయాన్ని ఎలా యోజన చేసుకోని ముందుకెళ్లాలి అని తెలిపారు. గొప్ప వాళ్ళ జీవిత చరిత్రలు, విజయాలు విద్యార్థిని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ జి.ఎల్.ఎన్ రావు, స్టూడెంట్స్ కౌన్సిలర్ రాజేశం, సరోజన,నాగ కుమారి తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

ఇబ్రహీంపట్నం సర్పంచ్ అభ్యర్థి బద్దం గోపి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా అని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ అభ్యర్థి బద్దం గోపి గ్రామ ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా శుక్రవారం తన కుటుంబ సభ్యులు, మద్దతుదారులతో కలిసి గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద గల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయస్వామి ఆశీర్వాదం,తన తల్లి యొక్క ఆశీర్వాదం తీసుకుని తన ప్రచారానికి పదును పెట్టారు. మద్దతుదారులతో కలిసి సర్పంచ్ అభ్యర్థి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తన గుర్తు లేడీస్ పర్సు గుర్తుకు ఓటు వేసి గ్రామ సర్పంచ్ గా తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఓటరు మహాశయులను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలతో పాటు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ మీలో ఒకడిగా ఉంటూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఓటర్లకు భరోసా కల్పిస్తున్నారు. ఈ నెల 11న జరిగే సర్పంచ్ ఎన్నికలలో ఒక్కసారి గ్రామ ప్రజలు అవకాశం ఇచ్చి లేడి పర్సు గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించి సర్పంచ్ గా గెలిపించాలని గ్రామ ప్రజలను సర్పంచ్ అభ్యర్థి బద్దం గోపి అభ్యర్థిస్తూ ప్రచారం చేపట్టారు. ఆయన వెంట నేమూరి సత్యనారాయణ, ఏలేటి చిన్నారెడ్డి,బద్దం మధు,గడ్డం చిన్నయ్య,మట్టెల రాజు, గుడేటి కాపు సంఘ సభ్యులు,మహిళలు,తదితరులు ఉన్నారు.

## నేడు అంతర్గాంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం



**ప్రజాపక్షం/గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇండిబెల్లి రవీందర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామగుండంలో నూతన విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్‌ను శాలువాతో సత్కరించినట్లు రవీందర్‌కుమార్ తెలిపారు.

## ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ





**ప్రజాపక్షం/ముత్తారం :** ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో స్థానిక ఎస్సై రవికుమార్ ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు, లేదా మద్యం రవాణా చేస్తూ దొరికితే, సంబంధిత డబ్బులు లేదా మద్యం తక్షణమే సీజ్ చేయబడుతాయి అని తెలిపారు.ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలు, డబుల్ నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాలను సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వాహనాలపై పెండింగ్ ఉన్న ఛలానాలు వసూలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. టూవీలర్ నడిపే వాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని ఎస్సై రవికుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వొల్వొ డ్రైవింగ్ శిక్షణ అభ్యర్థులకు పత్రాలు అందజేత




**ప్రజాపక్షం/గోదావరిఖని:** సింగరేణి వ్యాప్తంగా 54 మంది అభ్యర్థు లకు ఆర్‌జి1 ఏరియా టి.టి.సి.లో 12 రోజులపాటు వొల్వొ డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణను ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం శిక్షణ పొందిన అభ్యర్థులకు ఆర్‌జి1 జీఎం డి.లలిత్‌కుమార్ ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి సెక్రటరి అరెల్లి పోషం, సీఎంవోఏఐ వైస్ ప్రసిడెంట్ పెరుమాండ్ల శ్రీనివాస్, ఎస్వోటూ జీఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో జి.హనుమంతరావు, వొల్వొ మేనేజర్ సి.హరిబాబు, మేనేజర్ ఎం.అశోక్‌రావులు పాల్గొన్నారు.



## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ముస్తాబాద్:** రాష్ట్ర ఎన్నిక సంఘం పరిశీలకులు శ్రీ.రవి కుమార్ ముస్తాబద్ రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలట్ సహాయక కేంద్రం ఏర్పాటు పరిశీలించారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యగుల కోసం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక పోస్టల్ బ్యాలట్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. కావున ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జిల్లాస్థాయి పోటీల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన ఇన్స్పైర్ మనక్ పోటీలో ముత్తారం మండలంలోని దర్యాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన 9.వ తరగతి విద్యార్థి పి సాయి వర్షిత్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది. పెద్దపల్లి జిల్లా స్థాయిలో నిర్వహించిన బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని 2025 లో భాగంగా 8వ తరగతి విద్యార్థి సి హెచ్. విఘ్నసాయి బయో పెస్టిసైడ్( జీవ పురుగు మందులు) అను ప్రాజెక్టు ప్రగతి నివేదికను ప్రదర్శించి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని పొందడమనేది ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు.మండల విద్యాధికారి హరి ప్రసాద్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ కేసరి, తోపాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# ప్రజా పాలనా విజయోత్సవాలు కాదు,ప్రజా వంచనోత్సవాలు!

## బిజెఎల్‌పి నేత ఎమ్మెల్యే ఎలెటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన విజయోత్సవాల పై బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.నిర్మల్ పట్టణంలోని బిజెపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని,ఇది విజయోత్సవాలు కాని ''ప్రజా వంచనోత్సవాలు''గా అభివర్ణించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలవుతాయా అని రైతులు,రైతు కూలీలు,మహిళలు,నిరుగ్యోగులు,ఉద్యోగులు,పెన్షనుదారుల వంటి వర్గాలన్నీ రెండేళ్లుగా ఆశగా చూ స్తుంటే,హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాలంటూ సంబరాలు చేసుకోవడానికి సిగ్గుండాలని ఆయన ధ్వజమెత్తారు.ఏ మొహం పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేస్తూ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుకూలురను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు.కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఏం సాధించిందని ప్రజా విజయోత్సవాలు నిర్వహింస్తున్నారు.?ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టినందుకు విజయోత్సవాలా అని నిలదీశారు.,సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనకు నిర్వహించాల్సింది ప్రజా విజయోత్సవాలు కాదు ప్రజా వంచనోత్సవాలు లేదా ప్రజా దగా ఉద్సవాలు అని స్పష్టం చేశారు.హామీలను ఎగ్గొట్టినందుకు ఆయన పేరు ఎగవేతల రేవంత్ రెడ్డి అని పిలవాలని మహేశ్వర్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.తక్షణమే ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలను రద్దు చేసి,ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని,ఇచ్చిన హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టండి

## ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థులనే ప్రజలు వారి విలువైన ఓటు వేసి గెలిపించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు క ప్రకటన ద్వారా ప్రజలను కోరారు. జుక్కల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచు అభ్యర్థిగా సావిత్రి సాయాగౌడ్, మద్నూర్ మండలం మేనూర్ సర్పంచు అభ్యర్థిగా అశోక్‌పటేల్, శేఖాపూర్ సర్పంచు అభ్యర్థిగా లోఖండే గంగాధర్‌లు నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నామినేషన్ ప్రక్రియలో ఎమ్మెల్యేతో వారితో పాటు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

## జిల్లా సంక్షేమాధికారి బి. రాజమణి

## బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహ నిర్మూలనలో పురోహితుల పాత్ర కీలకమని జిల్లా సంక్షేమాధికారి బి రాజమణి అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని గోవింరాజుల ఆలయంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం షేర్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమన్వయంతో అవగాహన కార్యక్రమంలో షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారి రాజమణి పద్దెనిమిది సంవత్సరాలలోపు ఉన్న అమ్మాయికి, ఇరవై ఒకటి సంవత్సరాలలోపు వారికి పెళ్ళి చేస్తే ఇరువురు కుటుంబాల వారికి బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. ఆడపిల్లలకు మూడు ముళ్ళతో భవిష్యత్తు నాశనం చేయవద్దని, చదువు, క్రీడలు, సాంస్కృతిక రంగాలలో వారు రాణించుటకు కృషి చేయాలని అన్నారు. 27 డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం అర్చక సమాఖ్యతో పాటు పురోహితులు అనేక విధాలుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పురోహితులు సైతం సహకరిస్తున్నారని అన్నారు. అయితే వయస్సు ధృవీకరణకు చాలా మంది ఆధార్ కార్డు తీసుకువస్తే నిరాకరించి, పుట్టినతేదీ సర్టిఫికేట్ మాత్రం సంబంధిత జనన మరణ అధికారి, లేదా సంబంధిత పాఠశాల హెడ్ మాస్టర్ ఇచ్చిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకొని వివాహాలు చేయాలని, ఆ దిశలో కృషి చేయుటకు దేవాదాయశాఖ దృష్టికి తీసుకెళ్తారని అన్నారు. దేవాలయాల ప్రధాన అర్చకులు పురోహితులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల బీమా,రక్షణ చట్టాల అమలుకు కృషి చేస్తా

## టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** తెలంగాణ బార్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా ఖానాపూర్ బార్‌కు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ని ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు అసిఫ్ అలీ,షబ్బీర్ పాషా,బాశెటి శివ,సలీమ్ ఖాన్‌లు ముందుగా ఆత్మీయంగా స్వాగతం పలికారు.ఖానాపూర్ బార్ కౌన్సిల్ కి వచ్చిన సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ మెంబర్‌గా చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ రాబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.అదే విధంగా న్యాయవాదులకు ఆరోగ్య భీమా సదుపాయాలు,న్యాయ వాదులపై జరుగుతున్న రక్షణగా,రక్షణ చట్టం అమలు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్ ,న్యాయవాదులు నేరేళ్ల సత్యనారాయణ,మట్టేరి రాజశేఖర్,వెంకట్ మహేంద్ర,శివ,షబ్బీర్ పాషా,సలీమ్‌ఖాన్,షేఖ్ ఖదీర్,భూమి రవీందర్,ఎర్ర రవి,కడర్ల వెంకటేష్,రాజశేఖర్ పంతులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

## బహిరంగ కార్యక్ర మాలు, సభలు,ర్యాలీలు నిషేధం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా,ప్రశాంతతను పెంపొందించేందుకు గాను,జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 31,2025వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 నిబంధనలు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి ముం దస్తు అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు,ఊరేగింపులు,ధర్నాలు నిర్వహించరాదని ఆమె స్పష్టం చేశారు. చాకులు, కర్రలు, జెండా కర్రలు,దుడ్డుకర్రలు,తుపాకులు, పేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధయులను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది,చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను,జనసమూహం పోగు అవ్వడం వంటివి కూడా ని షేధం అని తెలిపారు.రాళ్లను జమ చే యుట,ధరించి సంచరించుట వంటివి కూడా ఈ సమయంలో నిషేధమని ఎస్పీ పేర్కొన్నారు.నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే, వారిపై 30 పోలీస్ యాక్ట్ 1861 కింద కఠిన చర్యలు తీసుకుని,శిక్షార్హులు అవుతారని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలో 'ITDA Pulse App ప్రారంభం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటిడిఏ) పరిధిలో గల నాలుగు జిల్లాలు(ఆదిలాబాద్,నిర్మల్,మంచిర్యాల,ఆసిఫాబాద్)లోని గిరిజన పాఠశాలలు,హాస్టల్స్ లో 'Common Diet Menu' అమలును పర్యవేక్షించేందుకు వినూత్నంగా 'ITDA Pulse App'ను లాంచ్ చేయడం జరిగింది.ఈ నూతన యాప్ ద్వారా హాస్టల్స్ లో విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత,పరిశుభ్రతను నిర్ధారించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.ఈ యాప్ సహాయంతో ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం)హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు (హెచ్‌డబ్ల్యూఓ) ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం,సాయంత్రం స్నాక్స్,రాత్రి భోజనం యొక్క ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం హెచ్‌ఎం,హెచ్‌డబ్ల్యూఓ లు ఈ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఫోటోస్ అప్‌లోడ్ చేస్తున్నారు.ITDA Pulse App' ద్వారా అప్‌లోడ్ అయిన ఆహార ఫోటలను నిత్యం పర్యవేక్షించడం జరుగుతుంది. ముఖ్యంగా,హెచ్‌ఎం,హెచ్‌డడబ్ల్యూఓ లు ఫోటోలను అప్‌లోడ్ చేసిన తర్వాత రోజువారీగా ప్రోగ్రామ్ ఆఫీసర్ (పిఓ) షేషి స్వయంగా ఈ నాణ్యతను పర్యవేక్షిస్తారు.అంతేకాక,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సాంకేతికతను ఉపయోగించి కూడా అప్‌లోడ్ చేసిన ఆహార పదార్థాలను,వాటి నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు.ఈ యాప్‌లో ఏవైనా సమస్యలు ఉన్నచో ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.ఈ Common Diet Menu విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తి స్థాయిలో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# రసవత్తరంగా గుడేల పంచాయతీ ఎన్నికలు

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలో కడపటి సమయానికి నామినేషన్ల పర్వం అట్టహాసంగా కొనసాగింది.మండలంలోని పంచాయితీలుగా ఏర్పడిన గుడేలు ఏకగ్రీవాల వైపు మొగ్గు చూపి లక్కంపూర్(జి) గ్రామ పంచాయతీలో వార్డ్ మెంబర్,ఉప సర్పంచ్,సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల వాతావరణం కొన్ని గుడేలలో రసవత్తరంగా జరుగుతుండగా కొన్న గుడేలు తండాలు ఎన్నికల వైపు ముగ్గు చూపడం ప్రజాస్వామ్యంలో ఉన్న విలువలకు నిలువుటద్దంగా కనబడుతూ ఉంది.కొన్ని పెద్ద పంచాయతీలైన తేజపూర్, వడూర్,కుమారి,బుద్ధికొండ,నేరడిగొండ,వాంకిడి,కొరటికల్,తదితర గ్రామాలలో ఎక్కువ శాతం అభ్యర్థులు పోటీలో నిలబడి రాజకీయంగా తమ సత్తాను చాటాలని యువకులు నామినేషన్ దాఖలు చేశారు.

# మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు తొలి దశ ర్యాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు.ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది పిఓ,ఓపిఓ లను నియమించనున్నారు.ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు.దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు.ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,డిపిఓ శ్రీనివాస్,డిఈఓ భోజన్న,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బిసిల సత్తా చాటాలి

ప్రజాపక్షం /శ్రీరాంపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా బిసిలు సత్తా చాటాలని బిసి సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసిలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం, మంచిర్యాల జిల్లాలో 7 శాతం ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జిల్లాలో 306 పంచాయతీలు ఉండగా కేవలం 23 బిసిలకు కేటాయించడం అంటే గ్రామస్థాయిలో తమను రాజకీయంగా అణచివేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీతో మాట్లాడి పార్లమెంట్ సమావేశాలను అడ్డుకోవాలన్నారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చితేనే రిజర్వేషన్లకు చట్టబద్ధత ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో బిసి భావజాలాన్ని విస్తరించి, మన ఓటు మనకే వేసుకొని అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పూదరి కుమార్, నాయకులు




వేముల కిరణ్, జంపాల చంద్రయ్య, ఆడెపు సురేష్, సమ్మయ్య, వెంకటేష్, సంపత్, శ్రీనివాస్ శ్రీకాంత్, సూర్య కిరణ్, నరేష్, కృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

## అశాంతి సృష్టిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం /మందమర్రి : గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బెదిరింపులకు పాల్పడినా, గొడవలు సృష్టించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి రౌడీషీటర్ పై పోలీసుల నిఘా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కాశీపేట ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సౌకర్యార్థం లయన్స్ జనరల్ ఆస్పత్రి

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి




ప్రజాపక్షం/బోధన్: పేదల ప్రజల ఆరోగ్య దృష్ట్యా బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ జనరల్ ఆస్పత్రి త్వరలో ప్రారంభం కాబోతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం లయన్స్ జనరల్ ఆస్పత్రిని సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రజలకు అందించే సేవలను గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ హాస్పిటలకు ధీటుగా లయన్స్ జనరల్ ఆస్పత్రి ప్రారంభం కాబోతుందని ఆస్పత్రిలో ముగ్గురు ఎండి ఫిజిషియన్ డాక్టర్లు ఇద్దరు జనరల్ డాక్టర్లు నర్సింగ్ సిబ్బంది ప్రజల ఆరోగ్య సౌకర్యార్థం అందుబాటులో ఉంటారని బోధన్ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని వారి వైద్య సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. నామమాత్రపు ఫీజుతో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. లయన్స్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు, నరసింహా రెడ్డి, కొడాలి కిషోర్, నాగేశ్వర రావు, విజయ్ కుమార్, నాయకులు గంగా శంకర్, రామ్మోహన్, దాము, లయన్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ ను కలిసిన కూనీపూర్ రాజారెడ్డి

ప్రజాపక్షం/బోధన్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ను హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసులో జిల్లా నుంచి తన పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉందని, 25సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నానని, యూనివర్సిటీ ఎంఎస్‌యుఐ అధ్యక్షుడిగా పనిచేశానని రాష్ట్ర యూత్ కాంగ్రెస్‌లో పది సంవత్సరాలు పని చేశానని ఎన్నికల ఇబ్బందులు ఉన్న పార్టీ వదలలేనని రాష్ట్ర ఇన్‌ఛార్జి నటరాజన్‌కు వివరించారు.

## నోటుకు అమ్ముడుపోవద్దు.. చేసిన అభివృది మరువద్దు

ప్రజాపక్షం /రెబ్బెన : ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో వచ్చే నాయకులను కాకుండా ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని కొమురవెల్లి మాజీ సర్పంచ్ పెద్దింటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు.కొమురవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఇరవై ఏళ్లుగా జరగని అభివృద్ధిని గడిచిన ఐదేళ్లలో చేసి చూపించామని తెలిపారు. కొమురవెల్లి నుంచి రంగాపూర్ వెళ్లే రహదారి ఇన్నేళ్లుగా ఎందరో నాయకులు మారినా మారలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి సీతక్క చేతుల మీదుగా రోడ్డు ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. గ్రామంలోని ప్రతి వీధిలో సిసి రోడ్లు నిర్మించామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామని వివరించారు. ఎన్నికలు రాగానే ఇంటిదారి తొక్కే నాయకులను నమ్మవద్దని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే



వారికే ఓటు వేయాలని కోరారు. డబ్బు ఉంటేనే గెలుస్తామనే ధీమాతో వచ్చే నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. డబ్బు లేని రాజకీయాలే అభివృద్ధికి బాటలు వేస్తాయని స్పష్టం చేశారు. తాను చేసిన అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకొని తనను గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ పెద్దింటి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ప్రజాపక్షం /జన్నారం : అన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖానాపూర్ లోని బిఆర్ఎస్ కార్యాలయంలో మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసిఆర్ సంక్షేమ పాలనను చూసి, మహమ్మదాబాద్ సర్పంచ్ అభ్యర్థి రామటేంకి శంకర్ గెలుపు కోసం యువకులు పార్టీలో చేరారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో చేస్తున్న దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు




సింగం రమేష్, ఇమామ్, కాజు మియా, సాయిలు, కొండ పద్మ, సింగం యుగంధర్, హసన్ భాయ్, దుర్గం శివ, సునారికారి కార్తీక్, నీలం గంగాధర్, ఎండి మైబెలి, అన్వర్ పాషా, ఫయాజ్, హైమత్, దుర్గం వినోద్ పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యాన్ని కాపాడటం అందరి బాధ్యత



ప్రజాపక్షం /మందమర్రి : భవిష్యత్తు తరాల ఆహార భద్రత కోసం నేలను ఆరోగ్యంగా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మందమర్రి మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిల్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించి నేల సారాన్ని కాపాడాలని సూచించారు. పశువుల పేడ, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్ట్ వినియోగాన్ని పెంచాలని కోరారు. అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నేల దెబ్బతింటుందని హెచ్చరించారు. అతిగా, లోతుగా దుక్కి చేయడం వల్ల రసాయన అవశేషాలు భూమి పొరల్లో నిలిచి చౌడు భూములుగా మారుతాయని, అవసరమైన మేరకు మాత్రమే దుక్కి చేయాలని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనాలి

ప్రజాపక్షం /రెబ్బెన : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ డేవిడ్ సూచించారు. రెబ్బెన మండలం గోలేటిలో ఇటీవల ప్రారంభమైన లక్ష్మీ వెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీస్ ను శుక్రవారం తహసీల్దార్ సూర్య ప్రకాష్ తో కలిసి ఆయన సందర్శించారు. మిల్లులోని కొనుగోలు విభాగం, తూకం యంత్రాలు, నిల్వ సదుపాయాలను పరిశీలించారు. తూకం ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, నిబంధనల ప్రకారం ధరలు చెల్లించాలని ఆదేశించారు. రైతులు వచ్చిన వెంటనే తూకం వేసి అనవసర ఆలస్యం లేకుండా చూడాలని, క్యూలైన్లలో గందరగోళం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మిల్లు యజమానులు చిలువేరు సత్యనారాయణ, చిలువేరు రవీందర్, కౌటారపు దత్తయ్య, కౌటారపు సాయి కృష్ణ, భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## అగ్నివీర్‌గా ఎంపికైన డిగ్రీ విద్యార్థి




ప్రజాపక్షం /కాగజ్ నగర్ : కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ప్రథమ సంవత్సరం పూర్తి చేసిన మండల చిరంజీవి ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్ గా ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీదేవి తెలిపారు. ఆర్మీలో ఉద్యోగం సాధించి ఇటీవల మధ్యప్రదేశ్ లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని, త్వరలో విధుల్లో చేరబోతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవిని ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి లక్ష్మీ నరసింహం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. నిత్యం క్రమశిక్షణతో ఉండి చిన్న వయసులోనే ఉద్యోగం సాధించిన చిరంజీవిని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి వెంకటేశం, రోజ్ మేరి, సిహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్




ప్రజాపక్షం /హాజీపూర్ : ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు హాజీపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే సమక్షంలో వారిని హాజరుపరిచారు. మల్లేష్ గౌడ్, రాజు, రాజయ్య, వెంకటయ్యలను ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆరు నెలల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# సర్పంచ్‌లు ప్రజల సమస్యలు తీర్చగలిగే సామర్థ్యం ఉన్న వారై ఉండాలి

## బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** సర్పంచ్ ఎన్నకిల్లో అభ్యర్థులను ఎన్నుకునే విషయంలో ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంత్రుల దగ్గరికి, ఎమ్మెల్యేల దగ్గరికి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రల దగ్గరికి వెళ్ల గలిగే, ప్రజా సమస్యలను తీర్చగలిగే సామార్థ్యం ఉన్న వ్యక్తులనే సర్పంచ్‌లుగా ఎన్నికోవాలని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ఎడపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని, గ్రామాలు అభివృద్ధి దిశగా పయనం చేస్తాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచ్ అంటే గ్రామంలో అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై, ప్రజల పక్షాన నిలబడే వ్యక్తి అయి ఉండాలని సూచించారు. సర్పంచ్‌గా ఎన్నుకోబోయే వ్యక్తి ఎవరికీ భయపడకుండా సమస్యల పరిష్కారం కోసం మంత్రుల వద్దకు గాని, ఎమ్మెల్యేల వద్దకు గాని వెళ్ల గలిగే ధైర్యం కలవారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 50శాతం మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికకాబోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా బ్లాక్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటి లింగం, సోసైటీ ఛైర్మన్‌లు మల్కారెడ్డి, నారాయణ, నాయకులు కామప్ప, ఎల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

# నిశ్శబ్ద డిజిటల్ ప్రచారం..

## పంచాయతీ ఎన్నికల్లో నయా ట్రెండ్
## సోషల్ మీడియాలో
## దూసుకెళ్తున్న అభ్యర్థులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** పంచాయతీ ఎన్నికల ప్రచారంలో విప్లవాత్మక మార్పు కనిపిస్తుంది. సాంప్రదాయ పద్ధతులైన బహిరంగ సభలు, మైకుల హోరు, గోడ రాతలకు స్వస్తి చెప్పి అభ్యర్థులు డిజిటల్ మాద్యమాలను ఆశ్రయిస్తూ నిశ్శబ్ద ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడంతో, సోషల్ మీడియ వేదికగా ఓటర్లను నేరుగా చేరుకుంటున్నారు.

### రూపాయి ఖర్చు లేని ప్రచారం

గతంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలు, గోడ రాతల కోసం వేల రూపాయాలు ఖర్చు చేయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అభ్యర్థులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇనస్టాగ్రామ్, యూట్యూబ్ వంటి మీడియా వేదికలను ప్రధాన ప్రచార అస్త్రాలుగా మలుచుకున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా కేవలం చిత్రాలు, వీడియోలు, సందేశాల ద్వారా తమను గెలిపించాలని అభ్యర్థిస్తూ ఓటర్ల ఫోన్లకు నేరుగా ప్రచారం పంపుతున్నారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉండటం కూడా ఈ నయా ట్రెండ్‌కు కారణమైంది.

### సోషల్ మీడియానే వార్ రూమ్...

ప్రస్తుతం ప్రతి ఒక్కరి స్మార్ట్ ఫోన్లలో సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉండటం అభ్యర్థులకు కలిసి వస్తుంది. అభ్యర్థుల కుటుంబీకులు, మద్దతుదారులు చురుగ్గా ఈ ప్రచారంలో పాల్గొంటున్నారు. ముఖ్యంగా వాట్సాప్ స్టేటస్‌లు అభ్యర్థుల ప్రచారానికి వేదికలుగా మారాయి. ప్రతి అభ్యర్థి తమకంటూ ఒక సోషల్ మీడియా వారియర్ బృందాన్ని ఏర్పాటు చేసుకొని, ప్రచార తంతును సమన్వయం చేస్తున్నారు.

### వాట్సాప్ గ్రూపుల్లో మేనిఫెస్టోలు...




మరికొందరు అభ్యర్థులు, ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, తమ సొంత మేనిఫెస్టోలను, హామీలను ఓటర్లకు చేరవేస్తున్నారు. తాము నాయకులుగా కాకుండా, కేవలం సేవకులుగా పని చేస్తామని నమ్మబలుకుతూ, గ్రామాల్లోని ప్రధాన సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.

### యువత, మహిళా అభ్యర్థుల దూకుడు..

యువ అభ్యర్థులు తమ గ్రామానికి వర్తించే పేర్లతో వాట్సాప్ గ్రూపులను సృష్టించి, తెల్లవారే సరికే పోస్టులతో ప్రచారం చేస్తున్నారు. సైతం కొత్తగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, తమ తమ గ్రామాలలో ఇది వరకే ఉన్న గ్రూపుల్లో ప్రచారం దూకుడు పెంచారు. ఇంకొందరు, మరింత ముందుకు వెళ్లి తమకంటూ ప్రత్యేక యూట్యూబ్ ఛానళ్లు పెట్టుకొని గంటగంటకు తమ గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. పోస్టులకు వస్తున్న లైకులు, వ్యూస్ చూసి లోలోపల మురిసిపోతున్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్



**ప్రజాపక్షం/బోధన్:** సాలూరా మండలంలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11న జరగనున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు శుక్రవారం సాలూర మండలంలో బోధన్ పోలీసుల ఆధ్వర్యంలో సాలూర మండలంలో పోలీసుల కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా, శాంతి యుతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఈ కవాతు ను నిర్వహించామని చెప్పారు. ప్రజలందరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి ఎన్నికల నియమాలను పాటిస్తూ ఎన్నికలు జరుపుకోవాలని, ఎవరైనా అనుమానాస్పద కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు తెలియచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన వంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, పట్టణ సిఐ వెంకట్ నారాయణ, ఎస్సై లు మచ్చేందర్ రెడ్డి, రమ, చంద్ర మోహన్, పోలిస్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మద్దతు దారుల తరపున ఎమ్మెల్యే ప్రచారం



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ డివిజన్ పరిధిలోని సాలూర మండలం జాడి జమాల్ పూర్ గ్రామంలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యరి మాలవరపు శౌరి నిహారికకు అండగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులుగా విద్యావంతులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగా శంకర్, సుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాలు ఎన్నికల ప్రచారానికి సోపానాలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** గతంలో ఎన్నికలు వచ్చాయంటే చాలు... వార్తాపత్రికల ప్రాధాన్యత ఎంతో ఉండేది. కాని ప్రస్తుతం వాటి వి లువలు పడిపోయాయి. ప్రస్తుతం సామాజిక మాద్యమాల ప్రాధాన్యత పెరిగింది.తక్కువ సమయంలో ఖర్చులు లేకుండా వార్తలు చేరిపోతున్నాయి. అవి ఎంత వరకు నిజం. ఎవరికి తెలియదు. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. పనులు బందు ఫోనే జీవితంగా మారిపోయింది. ప్రస్తుత పరిస్తితి ఇది. ఈ ఎన్నికలలో ఇదే ముఖ్యమైంది.

# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన ఎంపి అరవింద్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అర్వింద్ ధర్మపురి శుక్రవారం పార్లమెంటులో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి టెట్ తప్పనిసరి అన్ని కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై లేఖ సమర్పించారు. టెట్ తప్పనిసరి అన్న కేంద్ర నిర్ణయంవల్ల నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన దాదాపు 3 వేల మంది ఉపాధ్యాయులపై ప్రభావం చూపుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి, చాలా ఏళ్లుగా సేవ చేస్తున్న ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

# డబ్బుల కోసమే సర్పంచ్ నామినేషన్లు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో సర్పంచ్ పదవికి నామినేషన్లు కుప్పలు తెప్పలుగా వేస్తున్నారు. 22 గ్రామాల సర్పంచ్ పదవికి గురువారం వరకు 65 మంది పోటీపడగా ఈరోజు ఇంకా పెరగవచ్చు. ఎవరైనా నామినేషన్ వేశారంటే ఏదో మతలబు ఉంటుంది. చాలా మంది ఏదో ఆశతో వేస్తారు. అందుకే పోటీపడుతున్నట్టు తెలుస్తుంది.

# దృఢ సంకల్పానికి ప్రతీక దివ్యాంగులు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ:** శారీరకంగా వికలాంగులైనా, మానసికంగా సామర్థ్యపరంగా సకలాంగులతో సమానమే అని దివ్యాంగులను ఉద్దేంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా స్థానిక జూబ్లీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఉన్న దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం వారికి అన్ని విధాలుగా తోడుగా ఉంపందన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రోత్సాహం, సర్టిపికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీడ బ్ల్యూవో కోదండరాములు, దివ్యాంగుల జిల్లా కమిటి సభ్యులు చందు, ప్రభాకర్, సమ్మయ్య, సుమతి, కిషన్, కుమార్, సత్యనారాయణ, రమేష్, మున్నావర్, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబాల మధ్య మనస్పర్ధలు

## పదవుల కోసం పందేరాలు

**ప్రజాపక్షం / నందిపేట్ :** సర్పంచ్ ఎన్నికలు పలు కుటుంబాలలో భార్యా పిల్లల మధ్య మనస్పర్ధలు పెంచుతున్నాయి. పదవుల కోసం పంట పొలాలు పందేరంతో కుటుంబీకులు కొట్లాట పెంచుతున్నాయి. పదవులు రాగానే లక్షలు సంపాదించలేము, ఉన్నదాంట్లో సర్దుకుందాం. గ్రామ పంచాయతీ ఈపాటికే అప్పులలో ఉంది. రెండేళ్లు గా ప్రభుత్వం నుంచి నిదులు రావడం లేదని, లేనిపోని తల నొప్పులు మనకు అవసరమా అంటు కుటుంబంలో తంటాలు పడుతున్నారు. ఇంట్లో పిల్లల చదువులు, వారి ఖర్చులకే ఇబ్బంది అవుతుంది. దీనికి తోడు సర్పంచ్ ఎన్నికలు మనకు అవసరమా అంటు రోజు గొడవలే. ఉన్న కుటుంబాల వారికి ఏమి కాదు మనలాంటి పేద బ్రతుకులు ఈ భారం ముఖ్యమా అంటు కొట్లాడుకుంటున్నారు. ఇలాంటి పరిస్తితి మనకు వద్దు అంటు కాళ్ళు మొక్కుతున్న భార్యలు ఎంతో మంది ఉన్నారు. ఎవరిని ఎంత వరకు తెస్తుందో చూడాలి.

# ముగిసిన నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం / నందిపేట్ :** మూడవ విడత సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ పర్వం శుక్రవారంతో ముగిసింది. 22 గ్రామ పంచాయతీల కు 208 వార్డు మెంబర్లకు శుక్రవారంతో ప్రశాంతంగా నామినేషన్లు ముగిశాయి. రాత్రి 8 గంటలైనా అధికారులు రిపోర్టు అందివ్వలేదు. సర్పంచ్‌కు 133, వార్డులకు 570 నామినేషన్లు వచ్చాయి.

# కోడ్ అమల్లో ఉన్నా....‘‘బెల్ట్ తీయని ఎక్సైజ్ ’’

## ఎన్నికల వేళ ఏరులై పారుతున్న మద్యం...!

## ఓటర్ల మచ్చికకు ‘‘మందే’’ సరైన మందు....



**ప్రజాపక్షం/రామాయంపేట:**ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఎక్కడ చూసిన మద్యం ఏరులై పారుతూనే ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు(సర్పంచు, వార్డు సభ్యులు) నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల సందడి మొదలైంది అంటే చాలు...కేవలం ఓట్ల పండుగే కాదు గ్రామాల్లో మద్యం పండుగ కూడా మొదలైనట్లే. ఎన్నికల సంఘం ఎన్ని నిబంధనలు పెట్టినా మద్యం పంపిణికి అడ్డుకట్ట వేయడంతో ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపనలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు లైసెన్స్ దుఖాణాల్లో కూడా అమ్మకాలకు పరిమితి ఉంటుంది. కానీ గ్రామాల్లో పరిస్థితి ఇందుకు బిన్నంగా ఉంది. రామాయంపేట మండలంలోని కొన్ని గ్రామాల్లో వైన్స్‌లతో పోటీగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు బెల్ట్ షాపు నిర్వాహకులతో ముందుగానే ఒప్పందం చేసుకొని కావాల్సిన మందు నిల్వ చేసుకుంటున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి ‘‘మందే’ సరైన ‘మందు’ గా బావిస్తున్న అభ్యర్థులు ముందుగానే తమవైపుకు తిప్పుకుంటున్నారు. ఎన్నికల సందర్భంగా తాత్కాలికంగా మూసివేయాల్సిన బెల్ట్ దుఖాణాలు రెట్టింపు జోరుతో నడుస్తున్నాయి. ఇదంతా బహిరంగంగా నడుస్తున్నా వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లు పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో మద్యం పంపిణీని అరికట్టాల్సిన బాద్యత ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులపై కూడా ఉంది.

*** పైకి పకడ్బంది...కింద పట్టు సడలింపు...**

అక్రమంగా మద్యం నిల్వ చేసినా, ఎన్నికల్లో మద్యంతో ఓటర్లను ప్రలోబాలకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పైకి మాత్రం పకడ్బంది హెచ్చరికలు చేస్తున్నా కింది స్థాయికి వచ్చే సరికి పట్టు సడలించి నామమాత్రం తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపనలు అధికారులపై ఉన్నాయి. మద్యం నిల్వ కేంద్రాలు, పంపిణీ అవుతున్న కీలక ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించడంలేదని ఆరోపణ. స్థానిక ఎన్నికలు కావడంతో అభ్యర్థులు తమ పలుకుబడిని ఉపయోగించి అధికారులపై ఒత్తిడి తెస్తుండడంతో చర్యలు తీసుకోలేకపోతున్నారని తెలుస్తుంది. ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయగలిగితేనే స్థానిక సంస్థల ఎన్నికలు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరుగుతాయని చెప్పవచ్చు.

*** అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవు.. ఎక్సైజ్ సిఐ నరేందర్**

అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపినా, నిల్వ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని రామాయంపేట ఎక్సైజ్ సిఐ నరేందర్ అన్నారు. ఎన్నికల సమయంలో బెల్ట్ దుఖాణాల్లో జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ప్రజాపక్షం విలేకరి ఎక్సైజ్ సిఐని వివరణ కోరగా పై విదంగా స్పందించారు. ప్రతినిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామని, అక్రమ మద్యం అమ్మకాలు జరిగినట్లు మాదృష్టికి వస్తే దాడులు చేసి ఎన్నికల నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయానికి ఐదు లక్షల విరాళం

ప్రజాపక్షం/నిజాంపేట్:నిజాంపేట మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం మేడ్చల్ పట్టణానికి చెందిన గడ్డం లక్ష్మి శ్రీరామ్ గౌడ్ దంపతులు ఆలయ నిర్మాణం కోసం 5 లక్షల రూపాయల విరాళాలని ప్రకటించారు. ఈ సందర్భంగా గురుస్వామి రంజిత్ గౌడ్ మాట్లాడుతూ.. నిజాంపేటలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించామని ఆ హరిహర పుత్రుని ఆలయం నిర్మాణం కోసం ఎవరైనా దాతలు ముందుకు వచ్చినట్లయితే ఆలయ నిర్మాణంలో తమ వంతు కృషి చేసిన వారు అవుతారని అలాగే ఆలయ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ వారి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆలయ నిర్మాణానికి 5 లక్షల విరాళాన్ని ప్రకటించడం అయ్యప్ప స్వాములకు అన్నదాన భిక్ష ఏర్పాటు చేసిన గడ్డం లక్ష్మీ శ్రీరామ్ గౌడ్ కుటుంబ సభ్యులకు అయ్యప్ప ఆశీస్సులు అనుగ్రహం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు యాద గౌడ్, బాలకృష్ణ, నవీన్ రెడ్డి, నాయిని వెంకటేశం, రామచంద్రం, బాల్రెడ్డి, నవీన్ గౌడ్, ప్రణయ్ గౌడ్, శ్రీకాంత్,ధనంజయ, శ్రీకర్, గేమ్ సింగ్, కృష్ణ, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గని దర్శించుకున్న భారతి లక్పతి నాయక్

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గ భవాని అమ్మవారి సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ దర్శించుకున్నారు. శుక్రవారం ఏడుపాయల క్షేత్రానికి చేరుకోగానే వేద పండితులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఏడుపాయల గర్భ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పండితులు ఆలయ మర్యాదలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఆలయ కార్య నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ డెలివరీలో మిల్లర్లు అలసత్వం వీడాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




**ప్రజాపక్షం/మెదక్:** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరి ప్రక్రియలో మిల్లర్లు అలసత్వం వీడాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, రైస్‌మిల్లర్లతో అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మిల్లులవారీగా కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు అప్పగించిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. డెలివరి ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, రబి (యాసంగి) 202425 కొరకు సమర్పించవలసిన సీఎంఆర్ బ్యాలెన్స్ బకాయిల విషయంలో, మెదక్ జిల్లా అధికారుల సమక్షంలో సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయన్నారు. బకాయిలు ఉన్న మిల్లర్లు తమకు కేటాయించిన రోజు వారీ టార్గెట్లను తప్పనిసరిగా నిర్దిష్టంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినారు. రోజు వారీ లక్ష్యాలను పూర్తి చేయనట్లయితే సంబంధిత మిల్లర్లు డిఫాల్ట్ పరిగణించబడే ఆస్కారం ఉందని, అలాగే వారికి కేటాయించిన ధాన్యాన్ని ఇతర మిల్లులకు బదిలీ చేసే అవకాశం లేకపోలేదని అదనంగా, సీఎంఆర్ స్వీకరణకు చివరి తేదీ 28.02.2026 మాత్రమే అని, ఈ గడువు అనంతరం ఏ విధమైన సీఎంఆర్ స్వీకరణ చేపట్టబడదని అధికారులచే స్పష్టంగా తెలియజేయబడినది. సంబంధిత మిల్లర్లు గడువు ముగిసేలోపు తమ రోజు వారీ టార్గెట్లను యథావిధిగా పూర్తి చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నగేష్ సూచించారు.

## మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/కొల్చారం:**శుక్రవారము కొల్చారం మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్క్ ద్వార సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించేందుకు టోకెన్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. ఆమె వెంట సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## జిల్లాస్థాయి సైన్స్ ఫయిర్‌లో పాపన్నపేటకు బహుమతులు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** జిల్లా కేంద్రమైన మెదక్ లో నిర్వహించిన జిల్లా సైన్స్ ఫయిర్ లో మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలరెండు బహుమతులు దక్కించుకుంది. పాపన్నపేట ఉన్నత పాఠశాల నుండి నాలుగు ఎగ్జిబిట్లు ప్రదర్శించగా రెండు బహుమతులను గెలుచుకున్నాయి. సృజనాత్మక గణిత నమూనా జూనియర్ విభాగంలో వై అభిలాష్ జిల్లాస్థాయిలో రెండవ బహుమతి దక్కించుకోగా గైడ్ టీచరుగా ఎస్ రవికాంత్ వ్యవహరించారు, హెల్త్ అండ్ హైజిన్ సీనియర్ విభాగంలో జిల్లాస్థాయిలో ఎం దీక్షిత రెండవ బహుమతి దక్కించుకోగా గైడ్ టీచరుగా ఇందిరా వ్యవహరించారు. జిల్లాస్థాయిలో రెండు బహుమతులు దక్కించుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ ను ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజలు అభినందించారు.


## అక్రమ మద్యం పట్టివేత

**ప్రజాపక్షం/కంది:**కంది మండలం పరిధి ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి విజయ్‌కుమార్ నమ్మదగిన సమాచారం మేరకు తన సిబ్బంది తో ఇంద్రకరణ గ్రామములో ప్రత్యేక దాడి నిర్వహించాగా భవాని కిరాణం అండ్ జనరల్ స్టోర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న బేగరీ శ్యామ్ రావు దుకాణంలో రైడ్ చేయగా 23 లీటర్స్ అక్రమమ మద్యం దొరికింది. ఆ మెత్తం మద్యాన్ని స్వాదీనం చేసుకొని కేసు నమోదు చసి దర్యాప్తు చేస్టున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈసందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఎలెక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఏలాంటి కార్యకలాపాలు నిర్వహించిన చట్ట వ్యతిరేక పనులు చేసిన అక్రమంగా మద్యం అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటూ చట్టం ,శాంతి భద్రత పరిరక్షణ కోసం నిరంతరం చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఘనపూర్‌లో ఘనంగా అయ్యప్ప స్వామి 9వ పడి పూజ

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు:**పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఘనపూర్ లో ఘనంగా అయ్యప్ప స్వామి 9వ పడిపూజ కృష్ణా కాంత్ గౌడ్ ఘనంగా అయ్యప్ప స్వామి 9వ పడి పూజ నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ ఆదర్స్ రెడ్డి భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి వారి ప్రత్యేక పూజలు ,అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడి ఆద్యాత్మిక విశ్వాసాన్ని ఈప్రాంతంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ,మాజీ ఎంపిటీసి చంద్రశేఖర్ రెడ్డి ,బీఆర్ఎస్ యువత నాయకులు వృథ్వి రాజ్, మాణిక్, యాదవ్, సాయి చందర్ రెడ్డి , సీనియర్ బిఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, నర్రా బిక్షపతి ,దేవరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండలం పరిధిలోని రాంపూర్ గ్రామంలో అంగన్వాడి కేందర్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో టీచర్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రల ద్వారా ప్రభుత్వం గర్భిణీలకు, పసి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. గర్భిణీ స్త్రీలు ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గీతంలో అంతర్జాతీయ సదస్సు

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు:** భారత దేశంలోని ప్రయోగశాల జంతు శాస్త్ర వేత్తల సంఘం ఎల్ ఎఎస్ఏ సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ పార్మసీలో జంతు అద్యయనాల నుంచి ఔషద ఆవిష్కరణ అనువాద పరిశోదన పేరట అంతర్జాతీయ సదస్సును ఈ నెల 1920 తేదిలలో నిర్వహించనున్నారు. ఈ 13వ అంతర్జాతీయ ప్రిక్లినకల్ సదస్సుకు ముందు రోజు డిసెంబర్ 18న ఒక కార్యశాలనుకూడా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ జి. సుహాసీన్ ,డాక్టర్ ఎం.జే మహేష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యశాలలో ప్రిక్లినికల్ పరిశోధన నాణ్యతను పెంపొందించడానికి శాస్త్రీయ అధ్యయనాలలో ప్రయోగశాల జంతువుల నైతిక మానవీయ భాద్యతాయుతమైన వినియోగాన్ని ప్రొత్సహించడానికి రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎల్‌ఏఎస్‌వి సభ్యులు ప్రముఖ శాస్త్రవేత్తలు విద్యావేత్తలు,పరిశ్రమ నిపుణులు ప్రీక్లినికల్ అనువాద పరిశోదనలో నిమగ్నమైన పరిశోధకులకు శక్తివంతమైన వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సు విద్యా సంస్థలు,పరిశోదనసంస్థలు నియంత్రణ సఈ సందర్భంగా ప్రముఖ నిపుణులు పరిశోదనా పండితులు ,పరిశ్రమ నాయకులు అందించే కీలక ఉపన్యాసాలు సాంకేతిక ప్రదర్శనలు ,ముఖాముఖి చర్చలు పోస్టర్ల ప్రదర్శన ఉంటాయని తెలిపారు. ముందుగా నిర్వహించే కార్యశాల ప్రధాన సమావేశం రెండింటిలో పాల్గొనడానికి తమ పేర్లు నమోదు చేసుకునే ప్రతినిధులకు ఒకే రిజిస్ట్రేషన్ కీట్ లభిస్తుందన్నారు.